www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 31 | మే | 2026 పేజీలు : 8

## డిజిపిని కలిసిన కూనంనేని



2 లో

# అధికారుల మౌనానికి అర్థమేమిటి..?



-ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో సంపన్నులు, అధికారులు
-ఫెన్సింగ్ తొలగించి మరి ఆక్రమణ
-లక్షలు చేతులు మారుతున్న వైనం
-అధికారులపై ఒత్తిడి తెస్తున్నది ఎవరు..?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల ఫిర్యాదుల పైన స్పందించాల్సిన అధికారులు మౌనం వహించారంటే నానా అర్థాలు వెతకాల్సిం దే. పేదలపై ఒంటికాలిపై లేచే పెద్దలకు సంపన్నులు, రాజకీయ నాయకులు , మాజీ అధికారుల ఆక్రమణలు కనిపించకపోవడం శోచనీయం. ప్రభుత్వ, ఎన్నెస్పి స్థలాల ఆక్రమణకు సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక ఒక ప్రజాప్రతినిధి అనుచరుల హస్తముందని ఆయన పేరుతోనే అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం నగరంలో రెండు దశాబ్దాల క్రితం ఎన్నెస్పి కాలువ కట్టల పైన పేదలు గుడిసెలు వేసుకుని జీవించే వారు. అయితే పేదల గుడిసెలు ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయని న్యాయస్థానాలను ఆశ్రయించి కొందరు వ్యక్తులు కుట్ర పూరితంగా పేదలను అక్కడి నుంచి తరిమేసే విధంగా వ్యవహరించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వెనుక ఒక పెద్ద కుట్ర దాగి ఉందని ఇప్పుడు అవగతమవుతుంది.

మిగతా 2లో..

## కులాల వారీగా
# జనగణన జరగాలి



-వలసల ఆధారంగా ఓట్లు తొలగించే ప్రమాదం
-ప్రభుత్వ సలహాదారు విహెచ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కులాల వారీగా జన గణన జరిగితేనే బిసిలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు తెలిపారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణనలో అందరికీ అవకాశం ఇస్తామన్నారు కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. 1930లో కుల గణన, జన గణన జరిగిందని మరల ఇంత వరకు

మిగతా 2లో..

## పేటలో కలెక్టర్ విస్తృత పర్యటన

- యంగ్ ఇండియా పాఠశాల పనుల వేగం పెంచాలి
- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇళ్లు సిద్ధం చేయాలి
-కలెక్టర్ అంకిత్

సెంటర్ స్ప్రెడ్



## సినిమా ఆఫర్ పేరుతో రూ.23 లక్షలు హాంఫట్



-మహిళ అకౌంట్ నుంచి నగదు దోపిడీ
-ఫేస్‌బుక్ నుంచి గాలం వేసి.. ఘరానా మోసం
-బాధితురాలి బ్యాంక్ ఖాతా హ్యాక్ చేసి లగ్జరీ కారు కొనుగోలు
-లబోదిబోమంటున్న మహిళ
-సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

సెంటర్‌స్ప్రెడ్

# అధికారుల మౌనానికి అర్థమేమిటి..?







(మొదటిపేజీ తరువాయి)
పేదల గుడిసెలను తొలగిస్తే చుట్టు ఉన్న మనమే ఈ స్థలాన్ని ఆక్రమించుకోవచ్చునని భావించారు. గ్రీన్‌బెల్ట్ పేరుతో ప్రజాప్రతినిధులతో ప్రకటన చేయించి ఆ తర్వాత క్రమంగా ఆక్రమించడం ప్రారంభించారు. అష్టలక్ష్మి దేవాలయ సమీపంలో అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ భర్త ఒకరు మధిరకు చెందిన ఓ వ్యాపారితో చేతులు కలిపి ఏకంగా ఫెన్సింగ్‌ను తొలగించి లోపలికి వేశారు. ఈ ఫెన్సింగ్ జరపడం కారణంగా వ్యాపారికి సుమారు 150 గజాలు కలిసి రాగా ఈ విషయంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు సమాచారం. గత ఫెన్సింగ్ తొలగింపును ఇప్పుడు అధికారులు పరిశీలిస్తే స్పష్టంగా కనపడుతుంది. మరో అధికారి ఏకంగా ఫెన్సింగ్‌ను తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసి స్థలానికి రక్షణ కల్పించారు. దీనిపై అధికారులు స్పందించడం లేదు. చాలా మంది 66 అడుగుల వెడల్పు గల ఈ కాలువపై నిర్మాణాలు చేపట్టారు. గజం రూ. 50వేలు కనీస ధర పలికే ఈ ప్రాంతంలో విలువైన భూముల ఆక్రమణ జరుగుతుంటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సామాన్యులు గుడిసెలు వేస్తే పోలోమని యుద్ధాన్ని తలపించే రీతిలో దాడులు చేసే అధికారులు ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడం వెనుక ఉన్న రాజకీయ అదృశ్య శక్తులపై ఇప్పుడు చర్చ సాగుతుంది.

### బోర్డుల ఏర్పాటు వెనుక మతలబు ఏమిటి....?

ఆక్రమణలకు సంబంధించి వారం క్రితం వరకు తమకు పట్టాలు ఉన్నాయని దీనికి సంబంధించి కార్పొరేషన్ అధికారుల అనుమతులు ఉన్నాయని చెప్పిన ఓ రాజకీయ నాయకుని బంధువులు మీడియాలో వార్తలు రాగానే వెంటనే ప్లేటు పిరాయించారు. ఈ స్థలంలోని నిర్మాణం ఫలానా వ్యక్తికి సంబంధించిందని బోర్డు ఏర్పాటు చేశారు. వారం క్రితం వరకు వితండవాదం చేసిన తర్వాత ఏమి మతలబు జరిగిందో కానీ ఎన్నెస్పి స్థలంలో నిర్మించిన ఓ షెడ్డుకు మూలగుండ్ల వేణు యజమాని అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఆంధ్రా ప్రాంతం నుంచి ఖమ్మం నగరానికి చేరుకుని వ్యాపారంతో మొదలై రాజకీయంగా ఎదిగిన ఆయన ఈ ఆక్రమణలు, ఫెన్సింగ్‌ల తొలగింపు వెనుక చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ఆక్రమణలను యధేచ్ఛగా కొనసాగించేందుకే పార్టీ మారి ఇప్పుడు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

### రాజకీయ ఒత్తిళ్లే కారణమా....?

ఆక్రమణదారులపై ముఖ్యంగా సంపన్నులు, అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లే కారణమా అన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతుంది. సహజంగా ప్రభుత్వ ఆధీనంలో ఉండి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన తర్వాత ఆక్రమణలు జరిగితే వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవడం అనవాయితీ. కానీ ఎన్నెస్పి కాలువల పైన, సమీప భూముల పైన జరుగుతున్న ఈ ఆక్రమణలను అధికారులు చేష్టలూడిగి చూస్తుండడం వెనుక బలమైన రాజకీయం పనిచేస్తుందని అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలుస్తుంది. నెల రోజుల కింద ఎన్నెస్పి ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదు చేసిన వెంటనే అర్బన్ రెవెన్యూ అధికారులు కార్పోరేషన్ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకుంటామని ఆక్రమణల విషయం తమ నోటీసులో ఉందని చెప్పిన ఇప్పటికీ కనీస ఆ ప్రాంతాన్ని పరిశీలించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడే కారణమని తెలుస్తుంది. ఇటీవల ఘర్షణ జరిగిన మాజీ కార్పొరేటర్ మరో వ్యక్తి భూ వివాదంలో కూడా ఒక ప్రజాప్రతినిధి అనుచరులుగా చెప్పుకునే కొందరు ఉన్నట్లు అందుకే అధికారులు మౌనం వహిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నది కూడా నగరంలో చర్చ సాగుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఆలోచన చేసి ఆక్రమణలను తొలగించకపోతే త్వరలోనే పేదలు ప్రభుత్వ స్థలాలను అక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. సంపన్నులే ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న సమయంలో పేదలు తలదాచుకునేందుకు గుడిసెలు ఏర్పాటు చేస్తే తప్పేంటన్న వాదన బలంగా వినపడుతుంది. అధికారులు ఏమి చేస్తారో వేచి చూడాలి మరీ.

## కులాల వారీగా జనగణన జరగాలి

(మొదటిపేజీ తరువాయి)
లేదన్నారు. ఎస్ఐఆర్ అనే పథకం ఉద్దేశం మంచిదే కానీ రాహుల్ గాంధీ మొదటి నుంచి దొంగ ఓట్ల ప్రమాదం ఉందని అంటూనే ఉన్నారన్నారు. మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్‌లో లక్షల్లో ఓట్ల చోరీ జరిగిందని బిజెపికి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లు తొలగించారన్నారు. లంబాడీల ఓట్లు కూడా తొలగించబడ్డాయన్నారు. ఓట్లు తొలగించి గెలవాలన్నదే బిజెపి లక్ష్యమన్నారు. రాహుల్ గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఓటు హక్కు ప్రాధాన్యత చెప్పారన్నారు. బిసిలకు రాజ్యాధికారం కల్పించాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ ముందుకు సాగుతున్నారన్నారు. బూత్ స్థాయిలో ప్రతి ఓటును పరిరక్షించే ప్రయత్నం చేయాలన్నారు. సంచార జాతుల వారి ఓట్లు కూడా కాపాడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గుప్పెట్లో ఎలక్షన్ కమిషన్, సిబిఐ, ఈడిలు పనిచేస్తున్నాయన్నారు. కులగణన జరిపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దని దాని వల్ల 56 శాతం బిసిల జనాభా ఉందని తేలిందన్నారు. జనగణనలో ఇంత ఘోరమైన ప్రశ్నలు ఎప్పుడు అడగలేదని 12వ కాలంలో మీ ఇంట్లో మద్యం సేవించే వారు ఉన్నారా అనే ప్రశ్న చాలా ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర మోడీ, అమిత్ షాలదన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, ఓబిసి సెల్ అధ్యక్షులు బానాల లక్ష్మణ్, మథిన్‌బాయ్, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంఆర్‌వోకు రెండేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిన రిటైర్డ్ ఎంఆర్‌వోకు రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ వరంగల్‌లోని అవినీతి నిరోధక శాఖ న్యాయస్థానం శనివారం తీర్పునిచ్చింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ఎంఆర్‌వోగా పనిచేస్తున్న నర్సింహారావు ఓ రైతు వద్ద నుంచి మూడువేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడ్డారు. అప్పట్లో డిఎస్‌పి వెంకటేష్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 2011లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి శనివారం తీర్పువెలువడింది. కేసు విచారణ సందర్భంగా వాద ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి దేశ్‌పాండే నర్సింహారావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌లో ఏసిపి డిఎస్‌పి వై. రమేష్, సిఐ శేఖర్, జ్యోతిరెడ్డి, కానిస్టేబుల్ నర్సింహారావు లు సహకరించారు.

## డిజిపిని కలిసిన కూనంనేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌ను కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతర అంశాలపై చర్చించారు. సివి ఆనంద్ పాలనలో పోలీసులు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తదితరులు ఉన్నారు.

## వైరా మున్సిపల్ కమీషనర్‌గా రామచంద్రరావు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపల్ కమీషనర్‌గా ఎం.రామచంద్రరావు నియమిస్తూ ప్రభుత్వ జీవో ఉత్తర్వులు జారీ చేసింది. వైరా కమీషనర్గా విధులు నిర్వహించిన గురులింగం బదిలీపై వెళ్లిన తర్వాత మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్ ఇంచార్జ్ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల కాపీలో రామచంద్రరావు నూతన కమీషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## నేడు జావిద్ సంస్మరణ సభ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు మహ్మద్ జావిద్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీ రోడ్డులో గల రెడ్‌హిల్స్ నందు నిర్వహించే ఈ సంస్మరణ సభకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జి మంత్రి వాకటి శ్రీహరి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఎంఎల్‌ఏలు, కార్పోరేషన్ ఛైర్మన్లు హాజరవుతారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు ఈ సంస్మరణ సభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# 2.50 లక్షల బస్తాల మొక్కజొన్న కొనుగోలు

**-ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయ పాలెం సొసైటీ పరిధిలో 2.50 లక్షల బస్తాల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని అల్లిపురం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రావూరి సైదుబాబు మాట్లాడుతూ వివి పాలెం సొసైటీ పరిధిలో చింతగుర్తి, వి. వెంకటాయపాలెం, అల్లిపురంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చెప్పిన విధంగా కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ వరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. సొసైటీ పరిధిలో 300 లారీలు, ట్రాక్టర్ల ద్వారా సుమారు 750 మంది రైతులకు చెందిన 2.50 లక్షల బస్తాల మొక్కజొన్నను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసి వాటిని గోడౌన్లకు తరలించినట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుకు సంబంధించి రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చెప్పినవిధంగా మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేకంగా రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ తిరుపతిరావు, రైతులు రావూరి నాగరాజు, గుండె ఆదినారాయణ, పులిమళ్ల నాగేశ్వరరావు, మాదినేని సతీష్, పత్తిపాటి శ్రీను, సంక్రాంతి ప్రసాద్, దమ్మలపాటి సైదులు, రావూరి వీరయ్య, రావూరి చిన్న రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యల కాల్చివేతతో పెరుగుతున్న ప్రమాదాలు








**ప్రజాపక్షం/వైరా:** వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వలన ప్రమాదాలు తరచుగా చోటు జరుగుతున్నాయి. వారం రోజు వ్యవధిలోనే వైరా మండంలోని రెండు పెద్ద ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కాని ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వైరా మండలం గొల్లపూడి, రెబ్బవరం మధ్య వరి కోయలకు నిప్పు పెట్టడం ద్వారా మంటలు వ్యాప్తి చెంది దట్టమైన పొగ రోడ్లపై వ్యాపించడంతో పొగకు ఆర్‌టిసి బస్సు ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. నిప్పు పెట్టడంతో చెట్లు కాలి రోడ్డుపై వెళుతున్న కారుపై పడడంతో కారులో ఉన్న ప్రయాణీకులకు పెను ప్రమాదం తప్పిన సంఘటన జిల్లానే కుదిపి వేసింది.నిప్పు పెట్టడం వడగాల్పులకు మంటలు వ్యాప్తి చెందుకొని చుట్టుప్రక్కల ఉన్న పంటలకు,చెట్లకు నష్టం జరుగుతూ ఉంది. నిప్పు పెట్టడం వద్దు అని వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ,రెవెన్యూశాఖ పదేపదే ప్రచారం చేస్తున్న ప్రజల్లో మార్పు రాకపోతే నష్టపోయేది ఎవరు? మీరు చేసిన తప్పిదానికి ప్రాణాలు పోయేవి ఎవరివి, మీరు చేసిన తప్పిదానికి భూసారం తగ్గిపోతుంది. మీరు చేసిన తప్పిదానికి భూసారం తగ్గిపోతుంది. మీరు చేసిన తప్పిదానికి భూమి యొక్క బలం పూర్తిగా బలహీనంగా మారుతుంది. దీంతో పంట దిగుబడి తగ్గిపోతుంది. సారవంత మన భూమి అగ్నికి ఆహుతి అయిపోతుంది. వరి కొయ్యలను నిప్పు పెట్టవద్దు సమస్యలను కొని తెచ్చుకోవద్దు. ఒక్కసారి బాధ్యతాయుతంగా ఆలోచించండి, అధికారులను సూచనలను పాటించండి, వరి కొయ్యలను కాల్చకుండా భూమిని కలియదున్ని మురగనివ్వండి, అలా చేయడం వలన భూమికి బలం చేకూరుతుంది. వరి కొయ్యలను కాల్చడం వలన భూమి బలాన్ని కోల్పోతుంది. కాల్చడం వలన అపార నష్టాలున్నాయంటూ శాస్త్రవేత్తలు పదేపదే చెబుతున్నా మెజార్టీ రైతులు వరి కొయ్యలను, గడ్డిని తగులపెడుతూనే ఉన్నారు. ఈ విధానం వలన ప్రకృతి దెబ్బతినడమే కాదు, అన్నదాత అన్ని రకాలుగా నష్టపోవాల్సి వస్తుంది. సమీప ప్రాంతాలకు, మంటలు వ్యాపించి ఈత వనాలు, ఆయిల్‌ఫామ్, మామిడి తోటలు, ఇతర పంటలు దగ్ధమవుతున్నాయి. విద్యుత్ మోటార్లు, వైర్లు, వాహనాలు బూడిదవుతున్నాయి. మూగ జీవాలు కూడా చనిపోతున్నాయి.

## వరి కొయ్యలను కాల్చవద్దు : తహశీల్దార్ సురేష్



వరి కొయ్యలను కాల్చి ప్రమాదాలు గురయ్యే విధంగా చేయవద్దని వైరా తహశీల్దార్ సురేష్ తెలిపారు. వరి కొయ్యలను ట్రాక్టర్లతో కలియదున్ని భూమిలో మురిగే విధంగా చూసుకోవాలని, అలా వరి కొయ్యలు మురిగితే భూమికి ఎంతో బలమని ఆయన అన్నారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం ద్వారా భూసారం భూసాంద్రత దెబ్బతింటుంది. వీచే వడగాల్పులకు పెను ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. ప్రజలు దీనిని గమనించి నిప్పు పెట్టకుండా ఉండాలి. అదేవిధంగా వడగాల్పుల నేపథ్యంలో ఎక్కడ ఏ ప్రాంతంలో నిప్పు అంటించవద్దని ఆయన రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డబ్బులు కోసం ఎదురుచూస్తున్న కౌన్సిలర్లు..!

**ప్రజాపాలన-ప్రగతి లో సొంత ఖర్చులతో పనులు**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో మున్సిపాలిటీ వార్డుల్లో సొంతంగా ప్రతి వార్డులో వర్కర్లను ఏర్పాటు చేసుకొని పనులు చేపించడం జరిగింది. పనులు సమయంలో ఏ వార్డులో పనులు అవసరానికి అనుగుణంగా ప్రతి వార్డుకి ఆరుగురు వర్కర్లను ఏర్పాటు చేసుకొని వారికి రోజుకు రూ.600లు కూలి ఇచ్చేవిధంగా 23 రోజులు వార్డులో పని చేసినందుకు ప్రతి వార్డు కౌన్సిలర్ రూ.82800లు వారి సొంత డబ్బులతో పనులు చేయడం జరిగింది. అందులో మున్సిపాలిటీ నుండి రూ.25వేలు మాత్రమే వారికి ఇవ్వడం జరిగింది. మిగిలిన రూ. 57800లు నేటికి వారికి ఇవ్వలేదు. అప్పటి కమీషనర్‌గా విధులు నిర్వహించిన గురులింగం మీరు సొంత ఖర్చులు పెట్టుకోండి వెంటనే మున్సిపాలిటీనుంచి ఇస్తామని చెప్పడంజరిగింది. ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా వార్డులో పరిశుభ్రత కోసం ప్రతికౌన్సిలర్ సొంతంగా డబ్బులు పెట్టుకోని పని చేపించిన కౌన్సిలర్లకు ఇంకా డబ్బులు మున్సిపాలిటీనుండి ఇవ్వలేదని తెలుస్తుంది. నెలలు గడుస్తున్న పెట్టిన డబ్బులు రావడం లేదని పలువురు కౌన్సిలర్లు చర్చించుకున్నట్లు సమాచారం.

# అమెరికా నుంచి వచ్చి తల్లికి దహన సంస్కారాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అమెరికాలో స్థిరపడిన కూతురు తల్లి మృతి వార్త తెలుసుకుని తన స్వగ్రామానికి వచ్చి దహన సంస్కారాలు నిర్వహించిన ఘటన మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుతుంబాక సావిత్రి గురువారం మృతిచెందారు. ఆమె భర్త ఐదేండ్ల క్రితమే మృతి చెందగా ఆమెకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సుభాషిణితో కలిసి సావిత్రి నివసిస్తుంది. తల్లి మృతి వార్త తెలుసుకుని అమెరికా నుంచి వచ్చిన చిన్న కుమార్తె పాలేటి శ్రీదేవి (చిన్న చిట్టి) శనివారం దహన సంస్కారాలు నిర్వహించింది. తన తల్లి రుణం తీర్చుకునే అవకాశం ఈవిధంగా రావడం బాధాకరంగా ఉందని శ్రీదేవి విచారణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

# పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించండి

**విశ్రాంత ఉపాధ్యాయుడు గడల భాస్కర్‌రావు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గ్రామంలోని చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలను పంపించాలని అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని రకాల వసతుల ఉంటాయని విశ్రాంత ఉపధ్యాయుడు గడల భాస్కర్‌రావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల లో శనివారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించే అంగన్ వాడీ కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయని వివరించారు. ఏసిడిపిఓ సిహెచ్ రోజారాణి మాట్లాడుతు తల్లులకు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవలు గురించి వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని పిల్లలకు అన్ని రకాల వసతులు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ డి రాజ్యలక్ష్మి, యాసా వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఝాన్సీ, గడల కళావతి, మంచికంటి శిరంజని, పల్లని పిచ్చమ్మ, అయా అనురాధ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో ఆవులు మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యుత్ ఘాతానికి గురై మూడు ఆవులు మృతిచెందిన సంఘటన మండల పరిదిలోని ఉప్పలచలక సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాదితులు తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పలచలక గ్రామానికి చెందిన గుగులోత్ రాజు, గుగులోత్ వెంకన్న, భూక్యా కుమార్‌కుచెందిన మూడు ఆవులు మేతకు వెళ్లాయి. ఇటీవల గాలివానకు కిందపడిన విద్యుత్ తీగలకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో విద్యుత్ తీగలకు ఆవులు తగిలి విద్యుత్ ఘాతానికి గురై మృతిచెందాయి. బాదితులు విద్యుత్ శాఖనుంచి పరిహారాన్ని కోరుతున్నారు.

# కౌన్సిలర్ చొరవతో డంపింగ్‌యార్డు తొలగింపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం శ్మశాన వాటిక సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి చొరవతో శనివారం మున్సిపాలిటీ అధికారులు తొలగింపు చేపించారు. ఇక్కడి డంపింగ్‌యార్డ్ కారణంగా శ్మశానవాటికకు అంత్యక్రియల కోసం వచ్చే ప్రజలు దుర్వాసనతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే డంపింగ్ చెత్త వల్ల సమీపంలోని చెరువు నీరు కలుషితమవుతూ పర్యావరణానికి హాని కలుగుతోంది. ఈ సమస్యను కౌన్సిలర్ పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు తొలగింపు జరిగి శ్మశానవాటిక పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. ఈ సందర్భంగా ప్రజల సమస్యను పరిష్కరించడంలో సహకరించిన మున్సిపల్ అధికారులకు కౌన్సిలర్ ధన్యవాదాలు తెలియజేశారు.

# పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3లక్షల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు గ్రామంలో నవంబర్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీవరకు మరణించిన 30మంది మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3లక్షలను శనివారం అందజేశారు. ఈ నగదును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం సారథ్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి మంత్రి పొంగులేటి తరుపున నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుమ్మరి అంబేద్కర్, బండి సతీష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్లు ముత్యం చిన్న కృష్ణారావు, తేజావత్ పంతుల్‌నాయక్, మండల నాయకులు గునిగంటి సురేష్, కుక్కల అశోక్, పొంగులేటి అభిమానులు, టీం పొంగులేటి పిఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఐకెపి వీవోఏల రిలే నిరాహార దీక్షలు



ప్రజాపక్షం/పినపాక: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఐకెపి వీవోఏలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈసందర్భంగా పినపాక ఈ బయ్యారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌లు, ఫీల్డ్ ఆఫీసర్‌లు సమ్మె శిబిరాన్ని సందర్శించి, వీవోఏలకు సంఘీభావం తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమ్మెలో పాల్గొంటున్న వీవోఏలకు కూల్ డ్రింక్స్, జ్యూస్ పంపిణీ చేసి మద్దతు ప్రకటించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వీవోఏలు స్పష్టం చేశారు.

## డిసిసి అధ్యక్షురాలును కలిసిన గద్దల



ప్రజాపక్షం/పాల్వంచ : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన గద్దల రమేష్ శనివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షురాలు దేవీ ప్రసన్నను కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి, డిసిసి అధ్యక్షులు దేవీ ప్రసన్నకు దన్యవాదములు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్తానని, మండలంలో పార్టీ విస్తరణకు, బలోపేతానికి, శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. అనంతరం రమేష్‌ను పలువురు నాయకులు అభినందించారు.

## 90డిగ్రీల కోణంలో సీసీ రోడ్డు నిర్మాణం..అధికారుల నిర్లక్ష్యమా...?



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రంలోని పాత ఎస్‌వీఎస్ కళాశాల వైపు నిర్మించిన సీసీ రోడ్డు పనులపై బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. సాంకేతిక ప్రమాణాలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా 118 నుంచి 119 డిగ్రీల కోణంలో నిర్మించాల్సిన రహదారిని 90 డిగ్రీల కోణంలో నిర్మించడం పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పనితీరుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇలాంటి లోపం జరిగినప్పటికీ సంబంధిత ఇంజనీర్లు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో నిర్మాణ లోపాలపై అధికారులు బాధ్యులుగా గుర్తించి చర్యలు తీసుకున్న సందర్భాలను గుర్తు చేస్తూ, తెలంగాణలోనూ ఈ అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనం వృథా కాకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## భట్టుపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మరో అడుగు

### -ఎమ్మెల్యే పాయం చొరవతో నూతన బోరు మంజూరు



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం, భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో లక్ష్మీపురం రామాలయం వద్ద గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో మంజూరైన నూతన బోరు పనులను గ్రామ సర్పంచ్ తొలెం రమాదేవి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే నాయకుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని, గ్రామాల్లో తాగునీటి సమస్యల నివారణకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే ముందుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్ ,మాజీ సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు , సీనియర్ నాయకులు నేతాజీ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్కపల్లి నాగేశ్వరరావు,కొమ్మ వెంకన్న, ఆవుదొడ్డి శ్రీనివాసరావు, కుంటి గొర్ల లింగయ్య, బరపటి ఎంకన్న, గోసంగి సతీష్,సుర సంతోష్, శివరాత్రి మధు, మోడేపు సాంబయ్య, సూర వెంకన్న, మోడేపు శీన వెంకన్న, దూసర సైదులు, కర్కపల్లి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, యువకులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్జా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం బడా పెట్టుబడీదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ రైతులను అన్ని విధాలుగా నష్ట పరిచే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి భారత రైతాంగాన్ని సాగు చేయకుండా వెల్లగొట్టి బతుకు దెరువు లేకుండా చేయాలనే దుర్మార్గ వైఖరిని అవలంభిస్తున్నదని సంయుక్త కిసాన్ మోర్జా నాయకులు అన్నారు. ప్రభుత్వం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ రైతాంగానికి వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్జా ఆధ్వర్యంలో పాల్వంచ సిపిఐ కార్యాలయం నుండి కేఎస్‌పి రోడ్ వరకు నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. కనీస మద్దతు ధరల( ఎంఎస్‌పి) ఆర్డర్ జీవో ప్రతులను దగ్గం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్రమోడి కుట్రలను తిప్పికొడుతూ ఢిల్లీ మడి బొడ్డున రెండున్నర సంవత్సరాల పాటు వేలాది మంది రైతులు శాంతియుతంగా నిరసన తెలుపుతూ రోడ్ల మీదనే వండుకొని తింటూ ఎండకు ఎండి, వానకు తడుస్తూ అనారోగ్యం పాలై సుమారు 750 మంది రైతులు తమ ప్రాణాలను విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ధైర్యంగా ముందుకు నడుస్తూ, ప్రాణాలను లెక్క చేయకుండా రైతాంగం ఉద్యమాన్ని ఉధృత చేసిందని తెలిపారు. రైతన్నల పోరాటానికి ప్రధానమంత్రి మోడీ రైతుల ముందు మోకరిల్లి తప్పయిందని మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని చెప్పి తిరిగి దేశ రైతాంగాన్ని మోసం చేస్తూ మూడు చట్టాలను తెచ్చి పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా, వ్యవసాయ రంగానికి సరిపడా నిధులు కేటాయింపు చేయకుండా, సాగు సీజన్‌లో సరిపడా ఎరువులను అందించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోనే నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై పెను భారం మోపిందని మండిపడ్డారు. పెరిగిన చమురు ధరలతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని దీనితో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బడి పబ్బడిగా ధరలను పెంచుతూ దేశాన్ని అదోగతి పాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పంధించి మూడు నల్ల చట్టాలను రద్దు చేసి, పెంచిన ఇందన ధరలు తగ్గించాలని లేని ఎడల దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష రైతు సంఘాల నాయకులు వైఎస్ గిరి, దొడ్డా రవికుమార్, కల్లూరి కిషోర్, గౌని నాగేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, శనిగారపు శ్రీనివాసరావు, నామా పండు, వగ్గెల పద్మ, తాటి నాగరాజు, రాయబారపు వెంకటేశ్వర్లు, వేల్పుల రమేష్, నూపా సరోజని, మంకెన వెంకటేశ్వర్లు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన సొసైటీ ఉపాధ్యక్షులు


- కొత్తగూడెంలో ప్రతిపక్ష పాత్ర శూన్యం
- మనస్థాపంతో పార్టీ దూరం




ప్రజాపక్షం/పాల్వంచ : పాలక ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహించడంలో కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీ నాయకత్వం విఫలం అవుతోందని పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు, బిఆర్‌ఎస్ నాయకులు కాంపెల్లి కనకేష్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఇతర పార్టీ పదవులకు రాజీనామా చేశానని తెలిపారు. పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్ర శేఖరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావులకు తన రాజీనామా లెటర్‌ను పంపించినట్లు చెప్పారు. కేసిఆర్ నాయకత్వానికి, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనైన నేను 2014లో పార్టీలో చేరానని చెప్పారు. నాకు పార్టీ పట్ల ఉన్నటువంటి నిభద్ధతను గుర్తించిన నాయకత్వం 2020 సంవత్సరంలో పాల్వంచ లార్జ్‌సైజ్ కో ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవటం జరిగిందని చెప్పారు. గత 12 సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేశానని అన్నారు. పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి శాయశక్తులా పాటు పడ్డానని తెలిపారు. గత రెండున్నర ఏండ్లుగా కొత్తగూడెం నియోజక వర్గంలో నాయకత్వ లోపం తీవ్రంగా కనిపిస్తోందని, పార్టీ కార్యకర్తలకు సరైన దిశా నిర్దేశం చేసే నాయకులు లేకపోవటంతో కార్యకర్తలు తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారని దీనితో నియోజక వర్గంలో పార్టీ పరిస్థితి రోజు రోజుకూ దిగజారి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో బలమైన ప్రధాన ప్రతిపక్షంలో ఉండి కూడా పాలక ప్రభుత్వ వైఫల్యాలలను ప్రజా క్షేత్రంలో ఎండ గట్టలేక, నిలదీయలేక పోతున్నదని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాలను కూడా చేపట్టలేక చతికిలపడిందన్నారు. ప్రస్తుత పరిణామాలు, నాయకత్వ వైఫల్యం వల్లనే నియోజక వర్గంలో నిజమైన బిఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమ కారులు, కార్యకర్తలు తీవ్ర మనస్థాపానికి, నిరాశకు గురవుతున్నారని అన్నారు. దీనితోనే పార్టీలో కొనసాగలేక పార్టీకి రాజీనామ చేశానని చెప్పారు. నా రాజీనామాను తక్షణమే ఆమోదించాలని అగ్ర నాయకత్వాన్నికోరారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సినిమా ఆఫర్ పేరుతో రూ.23 లక్షలు హాంఫట్

- -మహిళ అకౌంట్ నుంచి నగదు దోపిడీ
- -ఫేస్‌బుక్ నుంచి గాలం వేసి.. ఘరానా మోసం..
- -బాధితురాలి బ్యాంక్ ఖాతా హ్యాక్ చేసి లగ్జరీ కారు కొనుగోలు
- -లబోదిబోమంటున్న మణుగూరు మహిళ
- -సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



ప్రజాపక్షం/మణుగూరు: సోషల్ మీడియా పరిచయాలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో చెప్పడానికి మణుగూరులో జరిగిన ఈ ఘటనే ఉదాహరణ. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ వ్యక్తిని గుడ్డిగా నమ్మినందుకు ఒక మహిళ ఏకంగా రూ.23 లక్షలు పోగొట్టుకుని రోడ్డున పడింది. సినిమా అవకాశాల పేరిట నమ్మించి ఆమె బ్యాంక్ ఖాతాలోని సొమ్మంతా ఊడ్చేయడంతో బాధితురాలు లబోదిబోమంటోంది. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరుకు చెందిన ఒక మహిళకు ఫేస్‌బుక్ ద్వారా వైజాగ్‌కు చెందిన ఎల్.వి.ప్రసాద్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తానేదో పెద్ద సినిమా రంగంలో ఉన్నట్లు బిల్డప్ ఇచ్చిన సదరు నిందితుడు, ఆమెకు సినిమాల్లో మంచి అవకాశాలు ఇప్పిస్తానని మాయ మాటలతో వల వేశాడు. ఆమెను పూర్తిగా నమ్మించిన తర్వాత, సినిమా అగ్రిమెంట్లు, ఇతర లాంఛనాల పేరిట ఆమె బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించాడు.అకౌంట్ హ్యాక్ చేసి లగ్జరీ కారు కొనుగోలు!బాధితురాలి బ్యాంక్ వివరాలు చేతికి చిక్కడంతో నిందితుడు ఎల్.వి.ప్రసాద్ ఆమె ఖాతాను హ్యాక్ చేశాడు. ఆ తర్వాత ఆమె అకౌంట్ నుండి ఏకంగా రూ.23 లక్షల మొత్తాన్ని కాజేసి, ఆ డబ్బుతో ఒక లగ్జరీ కారును కొనుగోలు చేశాడు. తన అకౌంట్ నుండి అంత పెద్ద మొత్తంలో డబ్బు మాయమవ్వడం గమనించిన బాధితురాలు షాక్‌కు గురైంది. తాను మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘరానా మోసం వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పేటలో కలెక్టర్ విస్తృత పర్యటన

- యంగ్ ఇండియా పాఠశాల పనుల వేగం పెంచాలి
- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇళ్లు సిద్ధం చేయాలి





ప్రజాపక్షం/అశ్వారావుపేట : జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం అశ్వారావుపేటలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు, తహశిల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యావాతావరణం కల్పించేలా అన్ని ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాలకు అనుసంధానంగా రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌళిక సదుపాయాలు అందుబాటులోనికి తేవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఐగు యంగ్ ఇండియా గురుకులాలను వచ్చే విద్యా సం. నాటికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం తహశిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ భూ భారతి, సాదాబైనామా, భూ సర్వే దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ప్రజల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి పారదర్శకమైన సేవలు అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరపాలన్నారు. అనంతరం మండలంలోని పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన, చివరి దశకు వచ్చిన ఇళ్లను జూన్ 2వ తేది నాటికి గృహప్రవేశాలు జరిగేలా సిద్ధం చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పేదల సొంతింటి కళను నెరవేర్చే ఇందిరమ్మ పథకం అమలులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో తహశిల్దార్ కిషోర్, మున్సిపల్ కమీషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఇ మదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఏ పాయం భరోసా

-ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ



ప్రజాపక్షం/పినపాక : మండలంలోని పండరంగాపురం పంచాయితీ పరిధిలోని ఇప్పలగుంపు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన గొగ్గెల అబ్బయ్య, కొమరం రాంబాబు కుటుంబాలను పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో ఇళ్లు, గృహోపకరణాలు, విలువైన వస్తువులు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెబుతూ ప్రభుత్వం, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎంఎల్‌ఏ హామీ ఇచ్చారు. అలాగే తక్షణ అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టాన్ని అంచనా వేయించి, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందించాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా వారి పక్షాన నిలబడటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విధుల్లో నిబద్ధత.. ప్రకృతిపై మమకారం పద్మావతి ప్రత్యేకత

-బదిలీపై వెళ్తున్న అధికారిణికి అశ్వాపురం ప్రజల భావోద్వేగ వీడ్కోలు



ప్రజాపక్షం/అశ్వాపురం: ఉద్యోగ ధర్మం, మానవత్వం, ప్రకృతి ప్రేమను సమపాళ్లలో మేళవించుకున్న అరుదైన వ్యక్తిత్వంగా అశ్వాపురం ఎంపీడీవో కార్యాలయంలో యూడీసీగా పని చేసిన పద్మావతి గుర్తింపు పొందారు. ఇటీవల ఆమె బదిలీ కావడంతో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహోద్యోగులు భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరక్షరాస్యులు లేదా పరిమిత విద్య కలిగినవారే ఉంటారు. అలాంటి వారితో ఒక అధికారిణిగా కాకుండా, కుటుంబ సభ్యురాలిగా ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని పరిష్కార మార్గాలు చూపడంలో పద్మావతి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. తన పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, ఇతర శాఖలకు సంబంధించిన అంశాల్లో ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేసి వారి నమ్మకాన్ని గెలుచుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరించడం, అవసరమైన సమాచారం అందించడం, ఎలాంటి హోదా బేధాలు లేకుండా అందరితో మమేకం కావడం ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలిచింది. అందుకే కార్యాలయానికి వచ్చే ప్రజల్లో ఆమెపై ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. ఇక ప్రకృతి పరిరక్షణ విషయంలోనూ పద్మావతి ప్రత్యేక ముద్ర వేశారు. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా మొక్కలు నాటి వారిని స్మరించుకోవడం ఆమె అలవాటుగా మార్చుకున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించారు. ప్రకృతిని ప్రేమించడం మాత్రమే కాదు, దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ఆచరణలో చూపించారు. సేవా భావం, వినయం, ప్రజల పట్ల అంకితభావంతో పని చేసిన పద్మావతి ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడి ప్రజల మన్ననలు పొందాలని, మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని స్థానికులు ఆకాంక్షించారు. ఆమె అందించిన సేవలను అశ్వాపురం ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని పలువురు పేర్కొన్నారు.

## వీవోఏల సమ్మెకు సీపీఐ మద్దతు



ప్రజాపక్షం/అశ్వాపురం: మే 22 నుంచి కొనసాగుతున్న వీఓఏల సమ్మెకు సీపీఐ అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్ మద్దతు ప్రకటించారు. వీఓఏల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఓఏలకు రూ 26వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, అర్హత కలిగిన వారికి సీసీలుగా పదోన్నతులు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు, ట్యాబ్‌ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వీఓఏల పోరాటానికి పూర్తి స్థాయిలో అండగా నిలిచి ఉద్యమం చేపట్టేందుకు సీపీఐ పార్టీ వెనుకాడదని తెలిపారు. సమ్మెల్లో వీఓఏలు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/అశ్వాపురం: సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని అశ్వాపురం గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని ఎత్తివేసి స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు ఐక్య పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గద్దల శివకృష్ణ, నల్లగట్ల వెంకన్న, చిలకా రామ చంద్రయ్య, కంగాల లక్ష్మి , మల్లేశ్వరి, కోటయ్య, ఉప్పలయ్య తదితర హమాలీలు, గ్రామ పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## వీవోఏల నిరవధిక సమ్మెకు బీఆర్‌ఎస్ సంఘీభావం



ప్రజాపక్షం/చంద్రుగొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత కొన్ని రోజులుగా శిబిరం ఏర్పాటు చేసుకుని నిరవధిక సమ్మె చేపడుతున్న వీవోఏలకు శనివారం మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వీవోఏల సమ్మెకు పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దార బాబు, నరుకుల్ల సత్యనారాయణ, నల్లమోతు వెంకటనారాయణ, సూరా వెంకటేశ్వర్లు, భూపతి రమేష్, గాదే లింగయ్య, అప్పాజీ శ్రావణ్, అంచ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పెరుగు ప్యాకెట్లు పంపిణీ



ప్రజాపక్షం/చంద్రుగొండ: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని శనివారం అయ్యన్న పాలెం గ్రామంలో ఉపాధి కూలీలకు పెరుగు ప్యాకెట్లులను కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి సురేష్ అందజేశారు. అదే విధంగా స్థానిక సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి ఉపాధి కూలీలకు ప్రభుత్వం అందించే పారలు, గడ్డపారలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పని సమయాలలో ఉపాధి కూలీలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నీటి సమస్య మెడికల్ తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యులు రాధా, రాంబాయమ్మ, నిఖిల్, నవ్య, నాయకులు సారేపల్లి రాధాకృష్ణ, శ్రీను, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి ఎలక్ట్రికల్ కుక్కర్ విరాళం



ప్రజాపక్షం/కారేపల్లి: స్వామివారి ప్రసాదాల తయారీతో పాటు నైవేద్యం వండేందుకు అవసరమైన ఎలక్ట్రికల్ కుక్కర్‌ను ప్రముఖ శ్రీనివాస బుక్ స్టాల్ యజమాని పిల్లి వెంకటేశ్వర్లు, ఆయన ధర్మపత్ని కృష్ణవేణి, కుమార్తైలు రచన, సౌమ్య దేవాలయానికి విరాళంగా అందజేశారు. సుమారు రూ 3వేల విలువైన బజాజ్ కంపెనీ ఎలక్ట్రికల్ కుక్కర్‌ను దేవస్థానం ప్రతినిధుల అభ్యర్థన మేరకు వెంటనే అందించడం విశేషం, గతంలో కూడా దేవాలయానికి పలు విధాలుగా సహాయ సహకారాలు అందించిన ఈ కుటుంబానికి దేవస్థానం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యుల పేర్లపై ప్రత్యేక పూజలు నిర్వహించి, కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల అనుగ్రహం ఎల్లప్పుడూ వారిపై ఉండాలని ఆయన అర్చకులు ఆశీర్వదించారు.

# రూ. 2కోట్ల సెస్ నిధులు విడుదల చేయండి

## -కమిషనర్‌కు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** పెండింగ్‌లో ఉన్న సెస్ నిధులు విడుదల చేసి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కోరారు. శనివారం కార్పోరేషన్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యను గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, కార్యదర్శి కె. కరుణకుమారి మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాబా మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థకు వసూలు చేసిన సెస్ నిధులు రూ. 2 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని కేంద్ర, శాఖ, గ్రామీణ గ్రంథాలయ నిర్వహణకు సెస్ ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. గ్రంథాలయ నిర్వహణ, పాఠకులకు మెరుగైన సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధుల అవసరాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ పెండింగ్‌లో ఉన్న రూ. 2 కోట్ల సెస్ నిధులను త్వరలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఖాతాకు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీ పట్ల సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది అఖిల్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -ఏవో ఉమామహేశ్వరరెడ్డి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని రజబ్‌అలీ నగర్‌లో రైతులకు పంట విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతులు లేకుండా తిరుగుతూ విత్తనాలు విక్రయించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం లైసెన్స్ పొందిన దుకాణాల్లో పేరెన్నిక కలిగిన కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. రైతులు వరి, మొక్కజొన్న పంటల వ్యర్థాలను కాల్చవద్దని ఆయన సూచించారు. పర్యావరణ కాలుష్యంతో పాటు అనారోగ్య సమస్యలు, భూసారం తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఆయిల్




పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంభించాలని, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వేదవ్యాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విఓఏల సమస్యలను పరిష్కరించాలి

## ఏఐటియుసి జిల్లా నాయకులు మంకెన కృష్ణ

**ప్రజాపక్షం/తల్లాడ :** గ్రామదీపికల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా నాయకులు మంకెన కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తల్లాడ మండల కేంద్రంవద్ద గత 9 రోజులుగా దీక్ష చేస్తున్న విఓల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతు గ్రామదీపికలు పడుతున్న కష్టానికి తగిన వేతనం నెలకు రూ 26,000 లు ఇచ్చి ప్రమాదభీమా రూ 20 లక్షలు ఇవ్వాలని అన్నారు. వారి న్యాయమైన డిమాండ్స్‌కు ఏఐటియుసి అన్నిరకాల సహాయసహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల అధ్యక్షురాలు సుజాత, మండల ప్రధాన కార్యదర్శి భాను, మండల కోశాధికారి వి కళావతి, ఉపాధ్యక్షురాలు కె విజయలక్ష్మి , సహాయ కార్యదర్శి ఎన్ అనసూర్య, తల్లాడ మండల వర్కింగ్



ప్రెసిడెంట్ పి నాగప్రసన్న, మండల గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి తోపాటు మండలంలోని అన్ని గ్రామాల విఓఏలు దీక్షలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** దీర్ఘకాలంగా పోలీసుశాఖలో వివిధ పోలీసు స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ వివిధ విభాగాల్లో శాతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పటునందించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బావిజీవితం కుటుంబసభ్యులతో సు ఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని సిపి ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఖమ్మం మహిళ పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.నాగేశ్వర రావు, టూటౌన్, ముదిగొండ ఏఎస్ఐలు ఎన్ ఉప్పయ్య, ఎం గురునాధం, ఖమ్మం కమ్యూనికేషన్ ఎస్ఐ పి లక్ష్మ ణరావు, మధిర పట్టణ పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్‌రావు ఉన్నారు. ఈ కారక్యక్రమంలో ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఆర్ ఐ కామరాజు, అసోసియోషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల పరిదిలోని రామానుజవరం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన పలువురికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అన్నవరం నుంచి హైదరాబాద్‌కు రామానుజవరం సమీపంలో అదుపుతప్పి రహదారి ఎడమవైపుకు ఉన్న రేకు బారికేడ్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు



పల్టీలు కొట్టి హైవేపై ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో కారును నడుపుతున్న స్వర్ణకంటి జశ్వంత్ (36) అలియాస్ అశోక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో 2021 బ్యాచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రమాదంలో జశ్వంత్ భార్య కిరణ్‌మౌనికకు కాలువిరిగింది. కుమార్తె మాన్య కు కాలుకు గాయాలయ్యాయి. కుమారుడు కళ్యాణ్ రామ్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వడదెబ్బ కార్మికునికి పరామర్శ

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మున్సిపాలిటీ కార్మికుడు శనివారం ఊడల కృష్ణమూర్తి వడదెబ్బకు గురై పడిపోవటంతో అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఛైర్మన్ మోహన్ నాయక్ కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ నాగేశ్వర రావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, అధ్య



క్షులు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు వేము రాంబాబు లతోపాటు మున్సిపాలిటీ కార్మికులు, కౌన్సిలర్లు, లక్కినేని రఘు తదితరులు కార్మికుని పరామర్శించి వైద్యం అందుతున్న తీరును పరిశీలించి ధైర్యాన్ని ఇచ్చారు. మున్సిపాలిటీ కార్మికులకు వేసవిలో రెండు పూటలా మజ్జిగను అందించాలని కమిషనర్‌ను ఏఐటీయూసీ జిల్లా నాయకులు కోరారు.

# నూతన పైపులైన్ ఏర్పాటుకు తీర్మానం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డబుల్ బెడ్‌రూం ఇండ్లకు త్రాగునీటి సమస్య లేకుండా నూతన పైపు లైన్ ఏర్పాటుకు తీర్మానించినట్లు సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి తెలిపారు. శనివారం చిమ్మపుడి గ్రామంలో పంచాయతీ పాలక వర్గ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉప




సర్పంచ్ జూలా వెంకటేశ్వర్లు గ్రామంలో త్రాగునీటి సమస్యతో పాటు డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమస్యల గురించి చర్చించారు. ఈ సమావేశంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు గ్రామ పంచాయతీ నిధుల ద్వారా నూతన పైపులైన్ ఏర్పాటు చేయుటకు పాలక వర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ త్రాగునీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ నిధులతో నూతన పైపు లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో కూడా త్రాగునీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన పైపులైన్ ఏర్పాటు చేసేందుకు తీర్మానించినందుకు పాలక వర్గానికి డబుల్ బెడ్‌రూం ఇండ్ల అభివృద్ధి కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. మిషన్ భగీరథ నీటితో పాటు నూతన బోరును వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ప్రారంభ విద్యను బలోపేతం చేసేందుకే పూర్వ ప్రాథమిక పాఠశాలలు

## మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల

**ప్రజాపక్షం/కరకగూడెంః** కరకగూడెం మండలంలోని అనంతారం, భట్టుపల్లి ప్రాథమిక పాఠశాల పరిధిలో పూర్వ ప్రాథమిక పాఠశాలలు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల తెలిపారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చిన్నారుల ప్రారంభ విద్యను బలోపేతం చేయడానికి ఈ పూర్వ ప్రాథమిక పాఠశాలలను మంజూరు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ



పాఠశాలల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందుబాటులోకి వస్తుందని ఆమె అన్నారు. 35 సంవత్సరాల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ యూకేజీలలో చేర్పించాలని,ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ప్రాథమిక పాఠశాలలోని ఒక తరగతి గదిని వినియోగించడంతో పాటు రంగురంగుల బొమ్మలు, ఆట వస్తువులు, చార్ట్స్, మరియు ఫర్నిచర్ ప్రభుత్వం సమకూరుస్తుంది. అలాగే ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఉపాధ్యాయులు మరియు ఆయాలను కూడా నియమిస్తుందని అన్నారు. కావున ఈ సదవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# బాలికల్లో నాయకత్వపు లక్షణాలు పెంపొందాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**
**- ఐడిఓసిలో మాక్ పార్లమెంట్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బాలికల్లో నాయకత్వపు లక్షణాలతో పాటు అత్మవిశ్వాసం. నిర్ణయ సామర్థ్యం, సామాజిక బాధ్యత పెంపొందాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశ బాలికలతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైనా ఆయన నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్‌ను చూసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ ద్వారా బాలికలు పార్లమెంటరీ వ్యవస్థ, చట్టసభల పనితీరు, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లులు ప్రవేశపెట్టడం, చట్టాల రూపకల్పన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళా భద్రత, హక్కులు, లింగ సమానత్వం, బాలికల విద్య వంటి అంశాలపై బాలికలు చురుకుగా చర్చలు నిర్వహించారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో చర్చలు కీలకమని, చట్టాలు ప్రజల అవసరాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తారని చెప్పారు. విద్యతో పాటు సామాజిక, రాజకీయ, రాజ్యాంగ అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా బాలికల భవిష్యత్ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలదన్నారు. 15 నుండి 18 సం.వయస్సు గల బాలికల కోసం ప్రత్యేకంగా 529 స్నేహా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ అనేక చట్టాలు, వాటి పనితీరుపై ఎస్‌పి బాలికలకు వివరించడంతో పాటు వారు అడిగిన మాదకద్రవ్యాల వినియోగం,నివారణ చర్యలు, సోషల్ మీడియా వల్ల నష్టాలు తదితరం అశాలపై సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, అడిషనల్ డిఆర్‌డిఓ బి నీలేష్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సోయం సుజాత, జెడ్‌పి సిఇఓ నాగలక్ష్మి, సిపిఓ సంజీవ రావు స్వర్ణలతా లెనిన, డిపిఎంలు, ఏపిఎంలు, కిషోరబాలికల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం

**రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** దేశ ప్రధానమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పాటుపడాలని, అందుకు అనుగుణంగా పార్టీ విస్తరణకు కృషి చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి 39వ, డివిజన్ టీచర్స్ కాలని, 41వ, డివిజన్ బాపూజీ నగర్, 44వ, డివిజన్ శ్రీనగర్ కాలనీలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతలుఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని మెజారిటీ స్థానాలలో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, సీరపు సుగుణ, నూకలస రిత, మాలంపాటి భవిత, దున్నపోతుల మణి, నాయకులు చీకటి కార్తీక్, కనగాల నారాయణ, ఆళ్ళ మురళి, ఎర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, నరహరి, కొండం వెంకన్న గౌడ్, ఎస్‌వికే ఆచార్యులు, చింతా నాగరాజు, మిరియాల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు, కూలీల సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

**-ఏఐకేఎంఎస్ కారేపల్లి మండల మహాసభలో వై ప్రకాష్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతాంగం, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పిలుపునిచ్చారు. జమాన్లపల్లిలో జరిగిన ఏఐకేఎంఎస్ కారేపల్లి మండల 6వ మహాసభను సంఘం సీనియర్ నాయకులు అలంపెద్ద చంద్రన్న జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. మహాసభకు కోయిల శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వై ప్రకాష్ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు, రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన ఎంఎస్‌పీ, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం, పీసా, ఫిఫ్త సిక్త్స్ షెడ్యూల్ అమలు కోసం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. భూములు, అడవులు, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. అనంతరం 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోగా కోయిల శ్రీనివాస్ అధ్యక్షుడిగా, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహాసభలో ప్రగతి శీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ)జిల్లా కార్యదర్శి వై జానకి సంఘీభావ సందేశం అందించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు మద్దెల రామ్మూర్తి, రాంజీ, కావేటి నాగేశ్వరరావు, గడ్డం ఎంకన్న, ఆలయం గురవయ్య, కోమల్ చంద్రయ్య, బాటయ్య, రాంబాబు, సుగుణ, జోగయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నారాయణ, రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి కృషితోనే సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌ల నియామకం

**ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్**




**ప్రజాపక్షం/మణుగూరు:** ఏఐటియూసి కృషి ఫలితం గానే సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ల నియామకం జరిగిందని ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణుగూరు ఏరియాలోని ఖాళీగా ఉన్న వేకెన్సీలను భర్తీ చేయాలని పలుమార్లు మేనేజ్మెంట్ వద్ద ప్రస్తావించి అనేకమార్లు స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి మ్యాన్ పవర్ సరిగా లేకపోవడం వల్ల మిగతా కార్మికులపై పని భారం పెరిగిపోతుందని ప్రస్తావించి సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ల నియామకానికి సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని ఆ సర్క్యులర్ ఫలితంగానే 108 అండర్ గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్లకు సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లు గా మారుస్తూ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని అన్నారు. ఇది ఏఐటియుసి కృషి ఫలితం అని అన్నారు. అలాగే ఏరియాలో పనిచేస్తున్న ఫిట్టర్ మరియు ఎలక్ట్రిషన్ టెక్నీషియన్లకు సర్ఫేస్ కన్వర్షన్ కొరకు ఏఐటీయూసీ నాయకత్వం కృషి చేసిందని దాని ఫలితంగానే ఫిట్టర్ మరియు ఎలక్ట్రిషన్ లకు సర్ఫేస్లో ఓపెన్ కాస్ట్ మరియు డిపార్ట్మెంట్లలో పోస్టింగ్ ఇప్పించడం జరుగుతుందని అన్నారు. నిరంతరం కార్మికుల సమస్యల పట్ల నిబద్ధతతో నిజాయితీగా పనిచేసే సంఘం ఏఐటియుసి మాత్రమేనని కావున కార్మికులు గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఎం. రామ నరసయ్య, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు మహిళ మృతి

**-చింతలబయ్యారంలో విషాదం**



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని చింతలబయ్యారం గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొనగంటి భద్రమ్మ(53)వడదెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం ప్రకారం భద్రమ్మ తన ఇంటి వద్ద ఉండగా తీవ్ర ఎండల కారణంగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించేలోపే ఆమె మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇటీవల జిల్లాలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో ఈఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మధ్యాహ్న వేళల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే భద్రమ్మ మృతి వడదెబ్బ కారణంగానే జరిగిందా లేదా అనే విషయంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

# పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జూన్ 5 నుండి నిర్వహించనున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయం కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 5నుండి 12వ తేది వరకు ఉ.9.30గం.ల నుండి మ.12.30 గం.ల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిలాల్లో మొత్తం 1399 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, వారికోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాధికారి బి నాగలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధి డా. ప్రతాప్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిత్యవసరాలు, ఆహార పదార్ధాల సరఫరాకు టెండర్లు : ఐటిడిఏ పిఓ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ ద్వారా నిర్వహిస్తున్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు నిత్యవసరాలు,ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. కూరగాయలు, అరటిపండ్లు, స్కిన్‌లెస్ చికెన్ సరఫరా చేసేందుకు ఆసక్తున్న వారు నేటి నుండి జూన్ 5వ తేది వరకు ఐటిడిఏ కార్యాలయంలో రూ.2 వేలు చెల్లించి టెండర్ ఫారాలు తీసుకుని ధారావత్ సొమ్ము కూరగాయలకు రూ.50వేలు, పండ్లకు రూ.50వేలు, స్కిన్‌లెస్ చికెన్ రూ.50 వేల డిమాండ్ డ్రాప్ రూపంలో టెండర్ ఫారానికి జతచేసి బాక్స్‌లో సమర్పించాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సరఫరా దారులకు డిపాజిట్‌లో 20 శాతం రాయితీ కలదని తెలిపారు. పాన్, టిన్ కార్డు నెంబర్లు, సొంత దుకాణం, బ్యాంకు ఖాతా కలిగి ఉండి ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. 6వ తేదిన ఐటిడిఏ సమావేశ మందిరంలో ఉ.11 గం.లకు టెండర్లు తెరుస్తారని చెప్పారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల కేంద్రంలో ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు బీఆర్‌ఎస్ మండల నాయకులు, చంద్రుగొండ టౌన్ పార్టీ అధ్యక్షులు, 2వ వార్డు సభ్యుడు సూరా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 300 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సూరా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో శ్రమిస్తున్న ఉపాధి హామీ కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు. కూలీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, ఉద్యమ నాయకుడు గాదె లింగయ్య, నరుకుల్ల వాసు, నరుకుల్ల అప్పాజీ, జానపాటి అనిల్, జగన్నాథం, పోతురాజు రాజా, తలారి నాగరాజు, కొండ్రు రాజు, అంబడికర్ర సుధీర్, కొండా వంశీ, యలమందల కిట్టు, సీపీఎం మండల కార్యదర్శి పెద్దిని వేణు, తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఆర్‌లో అరుదైన శస్త్ర చికిత్స



**-ఇలిజారో పద్ధతితో ఎముక పెంపు**
**-అవయవ రక్షణలో ఇదో మైలురాయి**
**-టిఆర్ఆర్ ఆసుపత్రి వైద్యులు తోట లక్ష్మ ణ్ కుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** టిఆర్ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు తోట లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. యాక్సిడెంట్ బాధితులకు అరుదైన శస్త్ర చికిత్సలు చేసి అవయవ పునర్ నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మ ణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీజ అనే మహిళకు ఇలిజారో పద్ధతిలో 12.2 సెంటీ మీటర్ల ఎముక పొడవు పెరిగేందుకు కృషి చేసి అవయవాన్ని కాపాడగ లిగామన్నారు.ఉదయ్ అనే వ్యక్తి విషయంలోనూ ఇదే జరిగిందన్నారు. సురేష్ అనే వ్యక్తికి పలు చోట్ల ఎముకలు విరిగాయని 130 కేజీల బరు వున్న అతనికి అనేక సవాళ్ల నడుమ శస్త్ర చికిత్స చేసి అత్యుత్తమ ఫలి తాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రమీల అనే మహిళకు వాల్‌గాస్ డిపార్మటి, అస్థియో ఆర్థైటిస్ బాధపడుతుండగా మొత్తం రిప్లేస్ మెంట్ చేసి తిరిగి సాధారణ జీవితాన్ని కల్పించినట్లు లక్ష్మ ణ్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యాయురాలు రాధకు 11 చోట్ల ఎముకలు విరిగాయని 20 రోజుల పాటు దశల వారీ వైద్యంతో ఆమె తిరిగి యధావిధిగా పని చేసేందుకు ఆపరేషన్ ద్వారా తోడ్పాడ్డామని ఆయన తెలిపారు. ప్రతి రోజు రోగుల సంరక్షణ అత్యుత్తమ వైద్యాన్ని అందించేందుకు టిఆర్ ఆర్ ఆసుపత్రి కృషి చేస్తుందన్నారు. కొన్ని ఘటనలు మాత్రమే మీడియా ముందుకు తీసుకు వచ్చామని తమ ఆసుపత్రిలో అత్యుత్తమ పద్ధతిలో ఆధునీకంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో పనిచే స్తున్న సిబ్బంది, ఇతర వైద్యులు ఈ విజయాలకు కారణమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అవయవాలు నష్టపోకుండా ముఖ్యంగా ఎముకలు విరిగిన ఘటనలో ఆధునీక వైద్య పద్ధతిలో చికిత్స చేస్తున్నా మన్నారు. లక్ష్మ ణ్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, టిఆర్ఆర్ ఆసుపత్రి ద్వారా చికిత్స పొందిన పలువురు రోగులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న పొగాకు మహమ్మారి..!



**-ఏటా 80లక్షల మంది బలి..**
**-అందులో 12లక్షల మంది అమాయకులే..**
**-నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఫ్యాషన్ పేరిట నేటి యువత సులభంగా అలవాటు పడుతున్నా వ్యసనం ధూమపానం, గూట్కా, బీడీ, సిగరెట్లు నేడు మానవ ఆరోగ్యానికి ప్రధాన శత్రువులుగా మారాయి. పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ధూమపానం మానేలా వారిని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో ఎన్నో రకాల మానసిక ఒత్తిడులు, ప్రలోభాలు ప్రజలను, ముఖ్యంగా యువతను ధూమపానం వైపు నెట్టేస్తున్నాయి. గుట్కా, బీడీ, సిగరెట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాన్ని భగ్నం చేస్తున్న మానవ శత్రువులుగా మారాయి.

### ఏటా 80 లక్షల మంది మృతి

ధూమపానం కారణంగా ప్రపంచంలో ప్రతి సంవత్సరం సుమారు 80 లక్షల మంది వరకు మృత్యువాత పడుతున్నారు. నిత్యం లక్షల మంది ఊపిరితిత్తుల జబ్బులు, క్యాన్సర్, గుండెపోటు వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, తాము ధూమపానం చేయకపోయినా ఇతరులు వదిలిన పొగను పీల్చడం (పాసివ్ స్మోకింగ్) వల్ల ఏటా 12 లక్షల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. గత సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) పిల్లలను పొగాకు పరిశ్రమ ప్రభావం నుంచి రక్షిద్దాం అనే థీమ్‌తో సోషల్ మీడియా స్టంట్స్, బ్రాండింగ్ ప్రకటనల నుండి యువతను రక్షించాలని పిలుపునిచ్చింది. ఈ సంవత్సరం పొగాకు వల్ల కలిగే తక్షణ, దీర్ఘకాలిక ఆరోగ్య పరిణామాలపై అవగాహన పెంచడంతో పాటు, ఈ వ్యసనం నుండి విముక్తి పొందడానికి ప్రజలకు ఆచరణాత్మక మద్దతును అందించడమే ముఖ్య ఉద్దేశంగా ప్రకటించారు.

### ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...

పొగాకు, గుట్కా వాడటం వల్ల నోటి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిం టుంది. నోటి క్యాన్సర్, చిగుళ్ల వ్యాధి, దంత క్షయం, దంతాలు ఊడిపో వడం, నోటి దుర్వాసన వంటి అనేక సమస్యలు వస్తాయి. నోటిలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే దగ్గరలోని దంత వైద్యులను సంప్రదించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### సమాజ బాధ్యతగా మార్పు రావాలి...

ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే ధూమపాన రహిత సమాజం సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, స్నేహితుల్లో, సహ ఉద్యోగుల్లో ధూమపానం చేసేవారిని ఆపేందుకు ప్రయత్నించాలి.



పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యువతను చైతన్యపరచాలి. పిల్లలు దేశ భవిష్యత్తు అని, వారిని ధూమపానం ముప్పు నుంచి కాపాడటం ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు మరియు సమాజ సభ్యుడి బాధ్యత అని వైద్యులు పేర్కొంటు న్నారు. ఈ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ పొగాకు రహిత జీవితం వైపు అడుగులు వేయాలని, ధూమ పానం లేని సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలు పునిచ్చారు.

### నోటిలో అనేక సమస్యలు :
### డాక్టర్ కె.రాజేష్ ప్రభుత్వ వైద్యులు



పొగాకు వాడటం వల్ల నోటిలో అనేక సమస్యలు వస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి నోటి క్యాన్సర్, చిగుళ్ల వ్యాధి, దంత క్షయం, దంతాలు8 ఊడిపోవడం, నోటి దుర్వాసన,పొగాకు వాడకం వల్ల నోటిలో కణజాలం వర్ణ ద్రవం పెరగడం, పొగాకు వాడకం నోటి ఆరోగ్యాలతో సహా ఆరోగ్యం పై హానికర ప్రభావాలు చూపుతాయి. నోటిలో ఎలాంటి జబ్బులు రాకుండా దగ్గరలోని వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకొని చెడు వ్యసనాలను మానుకోవాలి. దంత వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలి :

### ధూమపానం లేని సమాజాన్ని నిర్మిద్దాం.
### ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీ నాథ్ రెడ్డి



ప్రతి ఒక్కరూ పొగాకు పదార్థాలను పూర్తిగా వదిలించుకోవాలి. పిల్లలు దేశ భవిష్యత్తు వారిని ధూమపానం ముప్పు నుంచి కాపాడటం ఒక్క ప్రభుత్వాల బాధ్యతే కాదు ప్రతి తల్లి తండ్రి, ఉపాధ్యాయుడు సమాజ సభ్యుడిగా మన బాధ్యత. ఈ ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పిల్లల ఆరోగ్యాన్ని భవిష్యత్తును నీ కాపాడేందుకు మనమంతా ముందుకు రావాలి. ధూమపానం లేని సమాజాన్ని నిర్మిద్దాం.

# రూ.24 కోట్లతో నాలుగు చెక్ డ్యామ్‌లు నిర్మాణం

**-కట్టుకాచారం పనులను పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ రమేష్ రెడ్డి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నూతనంగా రూ.24 కోట్ల తో చెక్ డ్యామ్ లు నిర్మిస్తున్నట్లు ఇరిగేషన్ ఈఈ రమేష్ రెడ్డి పేర్కోన్నారు. మండలం లోని కట్టుకాచారం చెక్ డ్యామ్ నిర్మాణ పనులను శనివారం పరిశీ లించారు. సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో నాలుగు చెక్ డ్యామ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. నూతనంగా పైనంపల్లి, కట్టుకాచారాం, శంకరగిరితండా, ఊటవాగు తండా లలో రూ.24 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ చెక్ డ్యామ్ నిర్మాణాల వలన దాదాపు 1200 ఎకరాలు సాగులోకి రానున్నటు తెలిపారు. ఈ పనులను యుద్ధప్రాతిపధికన పూర్తి చేసి మూడు నెలలలో వినియోగంలోకి తీసుకరావాలని కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. చెక్ డ్యామ్ వలన భూగర్భజలాలు పెరుగుతుందని పేర్కోన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. చెరువులలో అనుమతులు లేకుండా,మట్టి ని తరలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా చేపల వేట సూచించారు. నీటి తరలింపును అడ్డుకుంటామన్నా. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, జేఈ లు టి.నరేష్, రుత్విన్ రెడ్డి, క్వాలీటీ కంట్రోల్ అధికారి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి జీలుగులు, జనుము విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని పచ్చిరొట్ట విత్తనాలు జీలుగులు, జనుము విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోసైటీలలో విత్తనాలను అందించనున్నట్లు తెలిపారు. సబ్సిడీ పై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోదుల బండ సోసైటీలో 49.80 క్వింటాల జీలుగులు, రామచంద్రాపురం సోసైటీ లో 49.80 క్వింటాలు, రాజేశ్వరపురం లో 199.80 క్వింటాల, చెన్నారం సోసైటీ లో 49.80 క్వింటాల మండ్రాజుపల్లి, సోసైటీ లో 60 క్వింటాలు, మోటాపురం 60 క్వింటాలు, నాచేపల్లి సోసైటీలో 45 క్వింటాలు, నేలకొండపల్లి సోసైటీలో 99 క్వింటాలు. రాజారాంపేట 60 క్వింటాలు జీలుగులు ఉన్నట్లు తెలిపారు. మండ్రాజుపల్లి సోసైటీ లో 10 క్వింటాల జనుములు, మోటాపురం సోసైటీలో 10 క్వింటాల జనుము, రాజారాంపేట సోసైటీలో 10 క్వింటాలు, నేలకొండపల్లి సోసైటీలో 10 క్వింటాల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జీలుగులు 30 కేజీల బస్తా, రూ.4905 ధర కు 50 శాతం సబ్సిడీ పై రూ.2453 రైతు చెల్లించాల్సి ఉందని తెలిపారు. జనుము 40 కేజీల బస్తా ధర రూ.6220 ఉండగా, 50 శాతం రాయితీ రూ.3110 రైతు చెల్లించాలని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పాస్పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు తీసుకుని సోసైటీ వద్ద విత్తనాలను పొందాలని సూచించారు.

# ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీసులో ఉన్న వారికి ఉపాధ్యాయుల ఎలిజిబులిటి టెస్ట్ (టెట్) పరీక్ష పాస్ కావడం తప్పనిసరి అని సుప్రీం కోర్టు పునరుద్ఘాటించింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత గడువును 2027 ఆగస్టు 31 నుంచి 2028 ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సవాల్ చేస్తూ వివిధ ఉపాధ్యాయ సంఘాలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను న్యాయస్థానం పూర్తిగా కొట్టి వేసింది. ఉపాధ్యాయుల భవిష్యత్తును, విద్యార్థుల విద్యా వ్యాప్తిని దృష్టిలో ఉంచుకుని టెట్ పాస్ కావడానికి రెండేళ్లు ఇచ్చిన గడువును మూడేళ్లకు పెంచింది. ఈ తాజా సవరణ ప్రకారం టెట్ ఉత్తీర్ణత సాధించడానికి గతంలో ఉన్న 2027 ఆగస్టు 31 గడువు ఇప్పుడు 2028 ఆగస్టు 31 వరకు పొడిగించింది. ఈ ఒక్క మార్పు మినహా గతంలో ఇచ్చిన తీర్పులోని మిగతా అన్ని అంశాలు యధావిధిగా అమల్లో ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యాహక్కు చట్టం రాక ముందు నియమితులై ఉద్యోగ విరమణకు ఐదేండ్లు పైగా సర్వీసు ఉన్న ఉపాధ్యాయులందరూ ఉద్యోగంలో కొనసాగాలన్న, పదోన్నతులు పొందాలన్న రెండేళ్లలో టెట్ పాస్ కావాలని 2025 సెప్టెంబర్ ఒకటిన సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 69 ఉపాధ్యాయ సంఘాలు గతేడాది అక్టోబర్ 12న సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై ఈనెల 13న సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం తీర్పును విడుదల చేసింది. పిటిషన్లను తోసిపుచ్చుతూ శుక్రవారం తుది తీర్పునిచ్చింది. విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి 15 ఏళ్లు దాటిన తర్వాత కూడా పరీక్ష పాస్ కావడానికి తమకు తగినంత సమయం లేదని చెప్పడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది.